మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# భూభారతి దరఖాస్తులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



భూ సరిహద్దులను చూస్తూ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

**గద్వాల జనవరి 6,ప్రభాతవార్త:**భూభారతి సమస్యల పరిష్కారం కోసం చేసుకున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఆదేశించారు.మంగళవారం కేటిదొడ్డి మండలం పాగుంట గ్రామ శివారులోని 103 సర్వే నంబర్‌లో భూభారతి కింద పట్టా భూములు నిషేధిత భూముల జాబితాలో ఉండటంతో ఏర్పడిన సమస్యపై దరఖాస్తు చేసుకున్న స్థానిక రైతులను కలెక్టర్ ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామంలో దారి సరిగా లేకపోవడం వల్ల బైక్‌పై వ్యవసాయ భూముల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంబంధిత భూముల పూర్వ రికార్డులు, సర్వే వివరాలు, డాక్యుమెంట్లను సమగ్రంగా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి రూల్స్ మరియు రెగ్యులేషన్స్ ప్రకారం నిషేధిత భూములపై వచ్చిన ప్రతి దరఖాస్తును పూర్వపు రికార్డులు, సర్వే డాక్యుమెంట్లు, ఫీల్డ్ సర్వే ఆధారంగా పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును న్యాయపరమైన విధానంతో, పారదర్శకంగా,ఎటువంటి సందేహాలకు తావు లేకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు.అనంతరం కేటిదొడ్డి మండలం, కేటీదొడ్డి గ్రామంలోని 67 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ ద్విచక్ర వాహనంపై వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తులో ఉన్న మిస్సింగ్ సర్వే నంబర్లను ఫీల్డ్‌లో స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు,భూ యజమానుల సమస్యలు, అభ్యంతరాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి

### ఉదండాపూర్ ఆర్ అండ్ ఆర్ పనులు

# వేగవంతం చేయాలి

- యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- భూ నిర్వాసితులకు త్వరితగతిన న్యాయం చేయాలి : కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్‌గర్ బ్యూరో, జనవరి 6 ప్రబాతవార్త:** జిల్లాలోని ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టుకు సంబంధించిన పునరావాసం (ఆర్ అండ్ ఆర్) పనులను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు.ఉదండపూర్ రిజర్వాయర్ ప్రాజెక్ట పరిధిలో కొన్ని చోట్ల మిగిలిపోయిన భూ స్వాధీన ప్రక్రియను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా వి.సి సమావేశ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ,వల్లూరు,ఉదండపూర్ ప్రాంతాల్లో కొంతమంది రైతులకు ఇంకా పరిహారం అందలేదని.కొన్ని న్యాయ పరమైన సమస్యలు ఉన్నాయని ఈ సమస్యలను త్వరగా పరిష్కరించి పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.ఉదండపూర్ రిజర్వాయర్ భూ నిర్వా సితులకు ఎన్ని ప్లాట్లు అందుబాటులో ఉన్నాయో, ఇప్పటి వరకు ఎన్ని ప్లాట్లు కేటాయించారో,ఇంకా ఎంత మందికి కేటాయించాలి నివేదిక సమ ర్పించాలని ఆదేశించారు పునరావాస కాలనీల్లో పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆలయాలు, బస్ షెల్టర్ల నిర్మాణం, మిషన్‌భగీరథ తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు వంటి – మిగతా4లో..

### భూత్పూర్ మున్సిపాలిటీ

# అభివృద్ధికి రు.16కోట్లు

- ఆరో వార్డుకు రూ.కోటి మంజూరు..
- 13న మంత్రి కోమటిరెడ్డిచే శ్రీకారం
- భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న లిక్కి నవీన్‌గౌడ్

**భూత్పూర్,జనవరి 6,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం రు.16కోట్లు మంజూరు చేసిందని, మున్సిపాలిటీలోని పదివార్డులల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ స్పష్టం చేశారు.ఈ పధకాలను ఈ నెల 13న రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.మున్సిపాలిటీలోని ఆరోవార్డు అమిస్తాపూర్‌కు రూ.కోటి మంజూరయ్యాయన్నారు.ఈ సందర్భంగా మంగళవారం అమిస్తాపూర్‌లోని 6వార్డులో నవీన్‌గౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలు,సమస్యలు తెల్సుకునేందుకు వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు.పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నవీన్ పిలుపునిచ్చారు. నవీన్ వెంట పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కెంద్యాల పద్మతో పాటు ఇతర నాయకులు ఆఫ్రోజ్,మట్టి ఆనంద్,కెంద్యాల మశ్చేందర్, కోరె పవన్, మలేష్ కెంద్యాల నరేందర్, రెంద్యాల రాజేష్,శివరాములు తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్

# పోరుబాట



జూరాల బ్యాక్ వాటర్‌ను తిలకిస్తున్న నాయకులు

- జూరాల నుంచి నార్లాపూర్ వరకు..
- ప్రాజెక్టుల పరిస్థితి, నీటి లభ్యతపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- కళ్ళకు కట్టినట్టు ప్రజలకు వివరించే ప్రయత్నం
- 7టీఎంసీల నీటి నిల్వ ఉన్న జూరాల నుంచి 70 టీఎంసీల ఎలా ఎత్తిపోస్తారని ప్రశ్న
- భవిష్యత్తును దూరదృష్టితో ఆలోచించే కేసీఆర్ సోర్స్ మార్చారని వివరణ
- మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సందర్శన
- పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

**మహబూబ్‌గర్ బ్యూరో, జనవరి 6 ప్రబాతవార్త:** బి ఆర్ ఎస్ పోరుబాట పట్టింది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూ ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టుల పరిస్థితులను ప్రజలకు అటు మీడియాకు వివరిస్తూ జూరాల ప్రాజెక్టు నుంచి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న కొల్లాపూర్ నియోజక వర్గంలోని నార్లాపూర్ రిజర్వాయర్ వరకు ప్రాజెక్టులను సందర్శిస్తూ అక్కడ పరిస్థితులను వివరించారు. మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తిచేస్తే ఎక్కడ బిఆర్ఎస్ కు పేరు వస్తుందని ఒకే ఒక్క కారణంతో పనులను పక్కన పెట్టిందని ఆరోపించారు. జనవరి నెల ప్రారంభంలోనే జూరాల ప్రాజెక్టు వద్ద బురద తప్ప నీళ్ల స్టోరేజీ ఉండే పరిస్థితి లేదని అలాంటప్పు డు 70 టీఎంసీల నీటిని ఎలా ఎత్తిపోస్తారని ప్రశ్నించారు. ప్రస్తుతం శ్రీశైలం బ్యాక్ వాటర్ లో సుమారు 100 కిలోమీటర్ల మేరా నీటి లభ్యత ఉందని అందుకే భవిష్యత్తును దూరాదృష్టితో ఆలోచించే బి ఆర్ ఎస్ అధినేత కేసిఆర్ సోర్స్ శ్రీశైలంకి మార్చారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు మీడియాతో మాట్లాడారు. వాస్తవాలను ప్రజలకు కళ్ళకు కట్టినట్టు వివరించే ప్రయత్నం చేశారు. బేషరతుగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన కొద్దిపాటి పనులను పూర్తి చేసి నీళ్ల ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో ఉద్యమానికి బీఆర్ఎస్ శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు.

**ప్రాజెక్టు పూర్తి చేయకుంటే మరో ఉద్యమమే..**

**మాజీ మంత్రి బిఆర్ఎస్ మహబూబ్‌గర్ జిల్లా అధ్యక్షుడు సి లక్ష్మారెడ్డి**

కాంగ్రెస్ ప్రభుత్వం జూరాల నుండి శ్రీశైలంకు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను ఎందుకు మార్చారు అంటున్నారు..ఎందుకు మార్చినమో ప్రజలకు చెప్పినం.. జూరాలను మొదట 19 టిఎంసిల సామర్థంతో నిర్మించాలనుకుని 11 టీఎంసీలకు తగ్గించి నిర్మించడంతో 7,8 టీఎంసీలకు మించి నీరు నిల్వ ఉండదని మాజీ మంత్రి బిఆర్ఎస్ మహబూబ్‌గర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వ తక్కువగా ఉంటుందని, దీంతో నీటి లభ్యత కూడా తక్కువగా ఉండడం వల్ల జూరాల వద్ద పాలమూరు రంగారెడ్డి చేపడితే ఎక్కువ ముంపు ఉంటుందని భావించి, ఆనాడు ఇంజినీర్‌లతో ఆలోచించి ప్రాజెక్ట్ సోర్స్ మార్చినట్లు తెలిపారు. ఏడు టీఎంసీల స్టోరేజీ ఉండే జూరాల నుంచి డెబ్బై టీఎంసీల నీటిని ఎలా తరలిస్తాం కాంగ్రెస్ నాయకులు కొంచమైనా ఆలోచించాలి కదా. దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయడానికి ప్రాజెక్ట్ సందర్శన చేపట్టినట్లు తెలిపారు. శ్రీశైలం వద్ద ఫిబ్ర వరి,మార్చి వరకు నీటిని ఎత్తిపోసుకునేందుకు నీటి లభ్యత ఉంటుందనేకనీస అవగాహన లేకుండా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం వృధా..ప్రజాధనం వృధా అవుతుందని ఆరోపించారు. ఇప్పటికే మక్తల్‌లో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఐదు వేల కోట్లు ఖర్చు పెడితే పాలమూరు ప్రాజెక్టు కింద నీళ్లు ఇవ్వొచ్చన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాలమూరు రంగారెడ్డి పథకాన్ని కేసీఆర్ గొప్పగా ప్రాజెక్ట్ డిజైన్ చేశారని, ప్రస్తుతం మంత్రి, ముఖ్యమంత్రి ఇద్దరు అవగాహన లేకుండా ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా నుండి ముఖ్యమంత్రి ఉన్నా ఉపయోగం సున్నా అని చెప్పారు. కాంగ్రెస్ మంత్రులు ప్రాజెక్టుల మీద దుష్ప్రచారం చేస్తున్నారని, బీఆర్ఎస్ అధికారంలోకి వస్తె ఆరు నెలల్లోపే పాల మూరు రంగారెడ్డి నుండి మేము నీళ్ళు ఇచ్చే వాళ్ళమ ని వివరించారు. సీఎం,ఇరిగేషన్ మంత్రి డైలాగ్ లు కొట్టుడు కాదు ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూర్తి చేయకపోతే జిల్లా ప్రజల తరుపున పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

**తప్పని తేలితే రాజకీయాల నుంచి వైదొలుగుతాం..**

**మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

పాలమూరు ప్రజలు వలసలు పోయింది కాంగ్రెస్ పాలనలోనే అని, జూరాల ప్రాజెక్టు బీఆర్ఎస్ పుణ్యం వల్లే పూర్తయిందని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. స్వల్ప నీటి లభ్యత – మిగతా4లో..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

# అభ్యంతరాలను పరిశీలిస్తాం

- 10న తుది జాబితా వెల్లడిస్తాం
- మహబూబ్‌గర్ కలెక్టర్ విజయేంద్ర బోయి
- ముసాయిదా ఓటరు
- జాబితాపై అఖిలపక్ష సమావేశం



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి


**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 6, ప్రభాత వార్త:** మున్సిపల్ వార్డుల వారీగా ఈనెల 1న ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితాపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలో మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ, భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీల్లోప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాపై మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థలో 144, భూత్పూర్ మున్సిపాలిటీలో88,దేవరకద్ర మున్సిపాలిటీలో 9 అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. ముఖ్యంగా ఒక వార్డులో ఉన్న ఓటర్లు మరో వార్డులో రావడం, కుటుం బ సభ్యులకు వేరువేరు పోలింగ్ కేంద్రాలలో ఓట్లు రావడం, ఒక కాలనీ ఓటర్లు రెండు మూడు పోలింగ్ కేంద్రాలలో ఉండడం వంటి వాటిపై అభ్యంతరాలు ఉన్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపారు. వార్డువారిగా ప్రచురించిన ఓటరు జాబితా పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పునః పరిశీలన చేస్తున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ తెలియజేశారు. వీటన్నిటిని ఈ నెల 9 లోపు పరిశీలించి 10న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని, అంతలోపు ఇంకా ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీలు తెలియజేయాలని కోరారు. అక్టోబర్ 1, 2025 ఆధారంగా ఓటరు జాబితాలో అప్డేట్ అయిన వాటిని మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని, దీని ద్వారానే తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని వెల్లడించారు. ఏలాంటి తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించి మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండడానికి అన్ని – మిగతా4లో..

### దైవ దర్శనానికి వెళ్తూ..

# అనంత లోకాలకు...

**రోడ్డు ప్రమాదంలో పర్దీపూర్ వాసులతో పాటు కర్ణాటక డ్రైవర్ మృతి**







**చిన్న చింతకుంట, జనవరి 6 ప్రభాతవార్త :** దైవ దర్శనానికి వెళ్తూ చిన్న చింతకుంట మండలం పర్దిపూర్ గ్రామ యువకులు మంగళవారం తెల్లవారు జామున మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుర్ఘటన చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం పర్దిపూర్ గ్రామానికి చెందిన కావలి నరసింహులు (28 )కురువ శివకుమార్ (24) వీరితో పాటు మరికొందరు తుఫానులో దైవదర్శనానికి వెళ్లారు. మంగళవారం తెల్లవారు జామున ఉజ్జయిని సమీపంలో ట్రక్కును ఢీకొనగా తీవ్రగాయాలైన వారిని హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే ఇద్దరు మృతితో పాటు కర్ణాటక చెందిన డ్రైవర్ జగన్ మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో పరిధి పూర్ యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వీరితోపాటు వెళ్లిన వారికి గాయాలు కాగా బుధవారం గ్రామానికి చేరుకుంటారని సర్పంచ్ తెలిపారు. ఈ దుర్ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కన్నతండ్రే కాలయముడు

- భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం చెంది..
- ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తాను ఆత్మహత్యాయత్నం
- నారాయణ పేట జిల్లాలో ఘటన



చిన్నారుల మృతదేహాలు



పిల్లల తండ్రి శివరాములు (ఫైల్)

**నారాయణ పేట, జనవరి 6, ప్రభాతవార్త:** కన్న పిల్లల పాలిట తండ్రి కాలయముడయ్యాడు.. పురుగుమందు తాగించి అప్పటికి మృతి చెందలేదని కాలువలో తోసేసి అతికర్కషత్వంగా ప్రాణాలు తీసిన ఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకున్నది.. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా తీలేరు గ్రామానికి చెందిన శివరాములుకు రిత్విక (8) చైతన్య (5) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో భార్యవిడాకులు తీసుకుని వెళ్లిపోవడంతో పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య తిరిగి కాపురానికి రావడంలేదని మనస్థాపానికి గురై మానసిక ఒత్తిడికి లోనై తన ఇద్దరు చిన్నారులకు విషం తాగించినట్లు తెలుస్తుంది. అయితే విషం తాగించినప్పటికీ వారు మృతి చెందకపోవడంతో సమీపంలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టు కాలువ వద్దకు తీసుకెళ్లి చిన్నారులను కాలువలో తోసి చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన కాల్వవద్దకు చేరుకుని ఇద్దరు చిన్నారుల మృతదేహాలను వెలికి తీయగా, అప్పటికే వారు మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారులను కాలువలతో తోసిన అనంతరం శివరాములు కూడా అదే క్రిమిసంహారక –మిగతా4లో..

# బ్యాంకర్లు లక్ష్యాలను సాధించాలి

- బ్యాంకు లింకేజీ రుణాలు వచ్చే మూడు నెలల్లో 100 శాతం లక్ష్యాలు పూర్తి చేయాలి
- గృహ నిర్మాణాలకు లక్ష్యం మేరకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి
- జిల్లాలో క్లెయిమ్ చేయకుండా ఉండిపోయిన బ్యాంకు డిపాజిట్లను సంబంధిత ఖాతాదారులకు క్లెయిమ్ పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



బ్యాంకు అధికారులతో సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, జనవరి 6 ప్రభాతవార్త :** ఈ ఆర్థిక సంవత్సరము నిర్దేశించుకున్న రూ.5339.27కోట్ల వార్షిక రుణ ప్రణాళికను మార్చి లోపు వందశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం ఐడిఒసి సమావేశ మందిరంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన త్రైమాసిక జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపులు, సమన్వయ సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వార్షిక ప్రణాళికల్లో నిర్దేషించున్న లక్ష్యాలు, ఇప్పటి వరకు సాధించిన పురోగతి పై అంశం వారిగా క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో చాలా మంది కష్ట జీవులు, చిరుద్యోగులు ఉన్నారని, వారందరినీ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కల్పించేందుకు బ్యాంకర్లు కృషి చర్యలు తీసుకోవాలని సూచించారు. సంవత్సరానికి కేవలం 20 రూపాయాలు, 449 రూపాయలు చెల్లిస్తే సరిపోయే భీమా పాలసీకి ఇంకా చాలా మంది దూరంగా ఉన్నారని, వారందరికీ అవగాహన కల్పించి బీమా చేయించే బాధ్యత బ్యాంకర్లు తీసుకోవాలని సూచించారు. రైతు అనుబంధ రంగాలైన వ్యవసాయం, పశు సంవర్ధక, మత్స్య శాఖల రైతులకు నిర్దేశించిన లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వలేదని, ఆయా బ్రాంచి మేనేజర్లతో మాట్లాడి వచ్చే త్రైమాసికంలో లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. కిసాన్ క్రెడిట్ కార్డు కింద మత్స్యకారులకు, డెయిరీ ఉత్పత్తి దారులకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ నెల రోజుల్లో రుణాలు పూర్తి చేయాలని, ఏదైనా కారణం చేత రుణం మంజూరు చేయలేని పక్షంలో దరఖాస్తు తిరస్కరించి దరఖాస్తు దారునికి సమాచారం ఇవ్వాలి తప్ప నెలల తరబడి దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టుకోవద్దని సూచించారు.విద్యార్థుల ఉన్నత చదువులకు ఇవ్వాల్సిన రుణాలు కేవలం 20 శాతం పూర్తి చేసారని, గృహ నిర్మాణ రంగానికి 25 శాతం రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో విద్యా రంగానికి, గృహ నిర్మాణానికి రుణాలు ఇచ్చేందుకు చాలా అవకాశాలు ఉన్నాయని, ఇందిరమ్మ ఇల్లు కట్టుకోలేని నిరుపేదలకు సైతం కొంత బ్యాంకు రుణాలు అందిస్తే ప్రభుత్వం నుండి బిల్లులు వచ్చాక చెక్కించేందుకు ఆస్కారం ఉందన్నారు. గృహ రుణాలు జిల్లాలో ఇల్లు కట్టుకునే వారికి ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి జరిగేందుకు కొత్తగా పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే వారికి ప్రధానమంత్రి ముద్రా యోజన, స్టాండప్ ఇండియా పథకాల కింద రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. రోజువారీ వ్యాపారాలు చేసుకునే చిన్న వ్యాపారులకు ప్రధానమంత్రి స్వనిధి కింద విరివిగా రుణాలు ఇవ్వాలని, మొదటి సారి రుణాలు తీసుకొని తిరిగి చెల్లించిన వ్యాపారులకు మలిదశ రుణాలు ఇవ్వాలని సూచించారు. పూచీకత్తు లేని ఈ రుణాలు 20 లక్షల నుండి కోటి రూపాయల వరకు ఇస్తుందని, ఈ పథకంపై అవగాహన కల్పించి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి సాధించేందుకు దోహదపడాలని బ్యాంకర్లను కోరారు. ప్రధానమంత్రి సుకన్య సమృద్ధి యోజన, ప్రావిడెంట్ ఫండ్, మ్యూచువల్ ఫండ్ వంటి పొదుపు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇటీవల గ్రామీణ స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణ ద్వారా 28 మంది నిరుద్యోగ యువతకు వన్ జి.పి., వన్ బిసి సఖి శిక్షణ ద్వారా ధృవ పత్రాలు పొందారని వారికి వారి స్వంత గ్రామ పరిధిలో బ్యాంకు బ్యాంక్ కరస్పాండెంట్ (బి.సి) ఉద్యోగ ఉపాధి కల్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు, బడుగు బలహీన వర్గాలకు, మహిళలకు వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు బ్యాంకు రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బ్యాంకర్లను కోరారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్ బ్యాంకర్లకు, జిల్లా అధికారులకు సమన్వయ కర్తగా ఉంటూ బ్యాంకుల ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలు, సెప్టెంబర్ 30 నాటికి సాధించిన లక్ష్యాల పై గణాంకాలతో వివరించారు.రిజర్వు బ్యాంక్ ఎల్‌డిఒ చేతన్ గోరేకర్, నాబార్డ్ డిడియం మనోహర్ రెడ్డి, ఎస్‌బిఐ ఎడిబి చీఫ్ కృష్ణమూర్తి, యుబిఐ చీఫ్ మేనేజర్ మురళీకృష్ణ, వివిధ బ్యాంక్ మేనేజర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేయిర్‌కు
# బయలుదేరిన విద్యార్థులు



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

**గద్వాల జనవరి 6, ప్రభాతవార్త:** ఈనెల 7, 8,9తేదీలలో కామారెడ్డి పట్టణ సమీపంలోని విద్యానికేతన్ హైస్కూల్‌లో జరుగు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జోగులాంబ గద్వాలజిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు బయలుదేరారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన జోగులాంబ గద్వాల జిల్లా నుంచి పాల్గొను వివిధ పాఠశాలల విద్యార్థులు , గైడ్ టీచర్లు బయలుదేరుతున్న బస్సు యాత్రను. మంగళవారం ఐడిఓసి ప్రాంగణంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకమైన అంశాలను బయటకు తీయడానికి ఇలాంటి సైన్స్ ఫెయిర్ ఉప యోగపడుతాయని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు. రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ విజయలక్ష్మీ, డీఎస్ఓ భాస్కర్ పాపన్న ఏసీజీ ఈ టి. శ్రీనివాస్ , డిసిఇబి సెక్రటరీ ప్రతాప్ రెడ్డి, వీరశేఖర్ వైజ్ఞానిక అభిమానులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి

### ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం.హృదయ రాజు

**అలంపూర్ జనవరి 6, ప్రభాతవార్త :** మన చదువే మనకు విలువ ను పెంచుతుందని, విద్యార్థులుగా చదువును నిరక్ష్యం చేయకుండా, సమయం ను ప్రణాళికబద్ధంగా విభజించుకొని అన్ని సబ్జక్ట్స్ లలో మంచి మార్కులతో ఉతీర్ణత సాధించాలని ఇంటర్మీడియట్ విద్యాధికారి (నోడల్ ఆఫీసర్) శ్రీ ఎం. హృదయ రాజు అన్నారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యా నోడల్ ఆఫీసర్ శ్రీ ఎం. హృదయ రాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల అలంపూర్ ను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా బోటనీ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. సంబంధిత అధ్యాపకుడితో అన్ని ఎక్విప్మెంట్స్,మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని ప్రయోగాలు చూపించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల తో ఇంటారాక్టు కావడం జరిగింది. వారితో మాట్లాడుతూ రాబోయే ఐపిఈ పరీక్షలకు 48 రోజుల సమయం మాత్రమే వున్నదని గుర్తు చేశారు. అలంపూర్ కళాశాల విద్యార్థులు అందరూ మంచి మార్కులతో పాస్ కావాలని కోరారు. విద్యార్థులకు గోల్ సాధించడానికి ఫెయిల్యూర్ అభ్యర్థుల సక్సెస్ స్టోరీలను తెలిపి ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, రాజు, రాములు విద్యార్థులు ఉన్నారు.

# మండల్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్

**నవాబుపేట,జనవరి6 ప్రభాతవార్త :** కూచూర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్ ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నామని మంగళవారం యూత్ అసోసియేషన్ ఆర్గనైజర్స్ తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించనున్న ఈ టోర్నమెంట్‌లో ప్రథమ స్థాయిలో నిలిచిన జట్టుకు రూ. 10 వేలు, ద్వితీయ స్థాయిలో నిలిచిన విజేతకు రూ.5000ల నగదుతో పాటు షీల్డ్ కప్పులు విజేతలకు, బెస్ట్ ప్లేయర్స్‌కు,బహుమతులు అందజేయబడతాయని ఈ సందర్భంగా కూచూరు యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కేవలం ఒకేరోజు నిర్వహించే మండల్ లెవెల్ టోర్నమెంట్లో పాల్గొనాల్సిన జట్లు రూ.300ల రుసుముతో,11వతారీకు సాయంత్రం 4గంటల లోపు జట్ల పేర్లు నమోదు చేయించుకోవాలని, కేవలం మండల పరిధిలోని గ్రామాల జట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఒక ప్లేయర్ ఒకే జట్టులో ఆడాలని ఎంపైర్ నిర్ణయమే తుది నిర్ణయంగా నియమ నిబంధనలు పెట్టారు.

# పాఠశాలలో తాత్కాలిక ఆధార్ సెంటర్

**శ్రీరంగాపూర్, జనవరి 6 ప్రభాతవార్త :** శ్రీరంగాపురం మండలంలోని కంబాలపురం గ్రామం ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగింది. స్కూల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు తమ యొక్క ఆధార్ కార్డు నందు పేరు, ఇంటిపేరు, పుట్టినరోజు లోని తేదీ లు, స్పెల్లింగ్ మిస్టేక్‌లు మొదలగు వాటిని సరి చేసుకోవడం కోసం ఆధార్ సెంటర్ను తాత్కాలికంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఆధార్ కార్డు నందు ఏవైనా తప్పులు ఉంటే విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు ఈ అవకాశం బుధవారం గురువారం శుక్రవారం వరకు ఉండి సంక్రాంతి సెలవుల తర్వాత తిరిగి17/01/2026 నుండి ప్రారంభం అవుతుంది.కనుక ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీధర్ కోరడం జరిగింది. 06ఎంబిఎన్ఆర్ 3,4: పాఠశాలలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసిన దృశ్యం

# పాత పల్లి యువకుడికి అరుదైన గౌరవం


### కాకతీయ యూనివర్సిటీ పిడిస్‌యు అధ్యక్షుడిగా బాలకృష్ణ ఎన్నిక



బాలకృష్ణ

**ధన్వాడ,జనవరి 6 ప్రభాతవార్త:** కాకతీయ యూనివర్సిటీలో ఈ నెల 5న నిర్వహించిన పిడిఎస్‌యు విద్యార్థి సంఘం 12వ మహాసభలు ఘనంగా ముగిశాయి. 40మంది ప్రతినిధుల పాల్గొనగా జరిగిన ఈ మహాసభల్లో ధన్వాడమండలం పాతపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి బాలకృష్ణను పిడిఎస్‌యు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాలకృష్ణ పాతపల్లి ప్రాథమికపాఠశాలలో చదువుకుని,ధన్వాడలో హైస్కూల్, ఇంటర్ పూర్తి చేశారు. నారాయణపేట సూర్యలక్ష్మి కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, బీఈడీ అనంతరం కాకతీయ యూనివర్సిటీలో పీజీ సీటు సాధించారు. చిన్ననాటి నుంచే కమ్యూనిస్టు భావజాలంతో ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన గతంలో నారాయణపేట జిల్లా పిడిఎస్ యు ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. అనేక ఉద్యమాల్లో పాల్గొని జైలు నిర్బంధాలు ఎదుర్కొన్న బాలకృష్ణ యూనివర్సిటీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పాత పల్లి గ్రామానికి గర్వకారణంగా మారింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.సాధారణ కుటుంబాల విద్యార్థులు ఉన్నత విద్య ద్వారా ఎదగాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పిడిఎస్‌యు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, యూనివర్సిటీలో తమ ప్రాంత విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



భవన నిర్మాణానికై స్థల పరిశీలన చేస్తున్న జిల్లా ఎస్పీ

**అమరచింత జనవరి 6,ప్రభాతవార్త:** అమరచింత పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణం కోసం సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేయాలని, సంబంధిత ఎమ్మార్వో ద్వారా వెంటనే సర్వే నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు. స్థల విస్తీర్ణం, రహదారి అనుసంధానం, ప్రజలకు సులభంగా చేరుకునే విధానం, భవిష్యత్తులో భవన విస్తరణకు అవకాశం వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని సర్వే నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు.భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నూతన పోలీస్ స్టేషన్ భవనం ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించచేందుకు వీలుగా. కార్యాలయ విభాగాలు, వాహనాల పార్కింగ్, సిబ్బంది వసతులు, భద్రతా ఏర్పాట్లు అన్నీ ఒకే ప్రాంగణంలో సక్రమంగా నిర్మాణం చేపట్టేందుకు వీలుగా స్థల సేకరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్‌స్టేషన్ అంటే కేవలం ఇటుకలు, సిమెంట్ కాదు.. అది ప్రజల నమ్మకానికి ప్రతీక. అందుకే భవిష్యత్తు అవసరాలను ముందే అంచనా వేసి, విస్తారమైన ప్రభుత్వ స్థలంలో నాణ్యమైన నిర్మాణం చేపట్టి ప్రజల భద్రతకు బలమైన మౌలిక వసతులే పునాది వేయాలని. ఎస్పీ అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, అమరచింత ఎస్సై, స్వాతి. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ మంజూరు

### ఎంపీ డీకే అరుణకు కృతజ్ఞతలు తెలిపిన మాజీ కౌన్సిలర్ అనూష రఘు



హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

**నారాయణపేట,జనవరి6 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఒకటవవార్డుకు మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్ మంజూరుకావడం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు కమ్యూనిటీ హాల్ సౌకర్యం లేకపోవడంతో మహిళాసంఘాలు,వార్డుస్థాయి సమావేశాలు, అత్యవసర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను వార్డు మాజీ కౌన్సిలర్ అనూష రఘు ఎంపీ డీకే అరుణ దృష్టికి తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించి కమ్యూనిటీ హాల్ మంజూరు చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ అనూష రఘు మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు సహకరించిన ఎంపీ డీకే అరుణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గతంలో కేంద్ర ప్రభుత్వ పథకాలలో భాగంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ద్వారా ఒకటవ వార్డులో బాల సదనం, వయోవృద్ధుల గృహం ఏర్పాటు చేసిన విషయాన్ని కూడా ఆమె గుర్తు చేశారు. ఈ కమ్యూనిటీ హాల్‌తో వార్డులో సామాజిక కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉపాధ్యాయుడై పాఠాలు బోధించిన కలెక్టర్



విద్యార్థులకు బోధన చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల జనవరి 6, ప్రభాతవార్త:** విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరై బాగా చదువుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎల్లప్పుడూ వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. మంగళవారం కేటిదొడ్డి మండలంలోని పాగుంట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నుండి పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, బోధన విధానం, సౌకర్యాలపై సమగ్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులందరూ తప్పనిసరిగా ప్రతిరోజూ తరగతులకు హాజరై, శ్రద్ధతో చదువుకోవాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల ఎఫ్.ఆర్.ఎస్ హాజరు యాప్‌ను పరిశీలించి, ఉపాధ్యాయులు అందరూ పాఠశాలకు సకాలంలో హాజరై 100 హాజరు నమోదు కావాలన్నారు.విద్య అనేది భవిష్యత్తుకు పునాది కాబట్టి హాజరును అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడి,వారి తెలుగు, ఆంగ్ల భాషా నైపుణ్యాలను పరిశీలించి వారికి విద్యాబోధన చేశారు. కొంతమందిని బోర్డుపై చదివించడంతో పాటు ప్రశ్నలు అడిగి వారి విద్య సామర్థ్యాలను తెలుసుకున్నారు.విద్యార్థులు చదవడం చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రాథమిక విద్యే జీవితానికి పునాది అని పేర్కొంటూ, అక్షరాభ్యాసం, చదవడం, రాయడం, అర్థం చేసుకునే నైపుణ్యాలు పక్కాగా నేర్పాలని సూచించారు.పునాది బలంగా ఉంటేనే ఉన్నత విద్యలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు.అలాగే పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి,మెనూ ప్రకారం పరిశుభ్రమైన పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమైనదని, విద్యతోపాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధలు వహించాలన్నారు. విద్యా ప్రమాణాల మెరుగుదలకు అధికారులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు. తదుపరి, గ్రామపంచాయతీలో పెన్షన్ పంపిణీ వ్యవస్థను జిల్లాకలెక్టర్ పరిశీలించారు.పోస్టల్‌ద్వారా వచ్చే పెన్షన్లు సమయానికి అందుతున్నాయా,బయోమెట్రిక్ ప్రక్రియ సక్రమంగా జరుగుతోందా అని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పెన్షన్ డబ్బులు సమయానికి అందించబడాలని, బయోమెట్రిక్ విధానాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, సర్పంచ్ అంజనప్ప,పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, పోస్టాఫీసు అధికారి లక్ష్మణ్, గ్రామ ప్రజలు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

# తప్పిదాన్ని పునరావృతం చేయకండి

### - కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషిచేయండి: బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బస్వరాజ్‌గౌడ్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సత్తూర్ బస్వరాజ్‌గౌడ్

**భూత్పూర్,జనవరి 6,ప్రభాతవార్త :** కార్యకర్తలు గత ఎన్నికల్లో చేసిన తప్పిదాన్ని పునరావృతం చేయకుండా సమిష్టిగా, కలిసికట్టుగా పని చేసి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించి బీఆర్ఎస్‌కు పూర్వవైభవాన్ని కొనసాగించాలని మున్సిపల్ మాజీ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ భూత్పూర్ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా పార్టీ నాయకులతో కలిసి మంగళవారం భూత్పూర్ మున్సిపాలిటీలోని నాల్గోవార్డు ఇందిరానగర్‌లో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ చైర్మన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు కళ్లునకబోదులని విమర్శించారు.ఇప్పటికీ గ్రామాలు,పట్టణాలలో బీఆర్ఎస్ చేపట్టిన పథకాలే దర్శనమిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్పపాటి తేడాతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఓడారని,అయినప్పటికి నైతిక విజయం బీఆర్ఎస్‌దేనని ఆయన స్పష్టం చేశారు.మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్ల కాలంలో గ్రామాలు, పట్టణాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించిందన్నారు.రానున్న రోజులు బీఆర్ఎస్‌వేనని పార్టీ నాయకులు,కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషిచేయాలని బస్వరాజ్‌గౌడ్ పిలుపునిచ్చారు.సమావేశంలో పార్టీ సీనియర్‌నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,టి మురళిధర్‌గౌడ్,మనెమోని సత్యనారాయణ,తూము శ్రీనివాస్‌రెడ్డి,మొల్గర నర్సింహ్మాగౌడ్,మొహ్మద్ సాధిక్, గడ్డం రాములు,గడ్డం ప్రేమ్‌కుమార్,రాము రాథోడ్,గొడుగు వెంకటరాజు,సత్తూర్ అశోక్‌గౌడ్,సత్తూర్ రాకేష్‌గౌడ్,గడ్డం భీమ్,సత్తూర్ వెంకటేష్ గౌడ్,సత్తూర్ తిరుపతయ్యగౌడ్,మొహ్మద్ ఆహ్మద్,మొహ్మద్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కార్యకర్త సమయపాలన పాటిస్తుంది

### పెద్దాపుర్ విచారణలో సిడిపిఓ వెల్లడి



పెద్దాపూర్ లో విచారణ చేపడుతున్న సిడిపిఓ దమయంతి

**ఉప్పునుంతల,జనవరి 6 ప్రభాతవార్త:**మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో పనిచేస్తున్న అంగన్ వాడీ కార్యకర్త కొత్త శ్రీలత సమయపాలన పాటిస్తుందని, ఐసిడిఎస్ ప్రాజెక్టు వారు అప్పగించిన పనులను తూచా తప్పకుండా అమలు చేస్తుందని ఐసిడిఎస్ సిడిపిఓ దమయంతి పేర్కొన్నారు.మంగళవారం పెద్దాపూర్ అంగన్‌వాడి కార్యకర్తపై జిల్లాస్థాయిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో విచారణ జరపగా అంగన్‌వాడి కార్యకర్త విధులకు సక్రమంగా హాజరవుతుందని, ఐసిడిఎస్ చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తారని ఈ ఫిర్యాదు అవాస్తవమని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామస్తులు అంగన్‌వాడి కార్యకర్త పట్ల సుముఖంగా ఉన్నారని ప్రజా వాణిలో ఇచ్చిన ఫిర్యాదులో ఎలాంటి వాస్తవాలు లేవని సిడిపిఓ దమయంతి తెలిపారు. విచారణకు హాజరైన గ్రామస్తులు ఇలాంటి ఫిర్యాదులకు స్పందించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై తాము కూడా ఫిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వాటిపై విచారణ పారదర్శకంగా నిర్వహించాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులపై రాజకీయం చేయడం సరికాదు సర్పంచ్ వంగా సాయిబాబు ఎన్నికల సమయంలో రాజకీయం చేయడం సరిపోతుందని, ఎన్నికల సమయం ముగిసిన వెంటనే ఎవరి పనులు వారు చేసుకోవడం మంచిదని, లక్షల రూపాయలు తీసుకొని విధులకు దుమ్మా కొడుతున్నా ఉద్యోగులపై చేపట్టని విచారణ చిరు ఉద్యోగుల పట్ల రాజకీయ నాయకులు చేస్తున్న ఆరోపణలపై అధికారులు స్పందించడం సరికాదని పెద్దాపూర్ సర్పంచ్ వంగా సాయిబాబు పేర్కొన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణంలో జరిగిన గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కొన్ని రాజకీయ శక్తులు ఇలాంటి రాజకీయాలకు తావివ్వడం సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# కందుల కొనుగోలులో రైతులకు నిబంధనల మొండి చేయి

### మార్క్‌ఫెడ్ అధికారుల కొరత, ప్రభుత్వ నిరక్ష్యంతో రైతులకు కోట్ల నష్టం



కందుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

**నారాయణ పేట,జనవరి 6 ప్రభాతవార్త :**నారాయణపేట జిల్లాలో కందుల కొనుగోలులో ప్రభుత్వ నిరక్ష్యం, నిబంధనల పేరుతో మొండి వైఖరి అవలంబించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.వ్యవసాయ సహకార సంఘం ద్వారా కొనుగోలు ప్రారంభించినప్పటికీ,ఇప్పటివరకు ఒక్క రైతు నుంచీ ఒక్క క్వింటాల్ కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. మార్క్‌ఫెడ్ అధికారుల కొరత,సమన్వయ లోపం కారణంగా కొనుగోలు ప్రక్రియ పూర్తిగా స్తంభించిందని రైతులు ఆరోపిస్తున్నారు. గత రెండు నెలలుగా నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు ప్రతిరోజూ 2,000 నుంచి 3,000 బస్తాల వరకు కందులు వస్తున్నప్పటికీ, ప్రభుత్వం ముందుచూపుతో చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా చివరి 15 రోజుల్లోనే కందుల దిగుబడి ఎక్కువగా మార్కెట్‌కు వస్తుండగా, ఇప్పటి వరకు సుమారు 80 శాతం మంది రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ మార్కెట్లో తమ పంటను అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించిన కారణంగా ప్రతి క్వింటాల్‌పై సగటున రూ.2,000 వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఈ ప్రాంతం రాష్ట్రంలోనే తొలుత కందులు మార్కెట్‌కు వచ్చే ప్రాంతమైనప్పటికీ, ప్రభుత్వం రెండు నెలలు ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో ఇప్పటి వరకు రైతులకు సుమారు రూ.10 కోట్ల మేర నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లోనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఉంటే రైతులకు సరైన ధర లభించి లాభం చేకూరేదని రైతు నాయకులు పేర్కొన్నారు. కానీ పరిపాలనా అధికారులు, సంబంధిత ప్రభుత్వ విభాగాల నిరక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు ఎవరి మేలు కోసమో, ఎవరి ప్రయోజనాల కోసం అమలవుతున్నాయో అర్థం కావడం లేదని వారు ప్రశ్నించారు. ఈ సమస్యను గత ఎన్నో రోజులుగా భారతీయ కిసాన్ సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ, అధికారులు స్పందించకపోవడం విచారకరమని తెలిపారు. ఈ విషయమై రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, మండల అధ్యక్షులు శాసనపల్లి గణప్ప శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పటేల్ రంగారెడ్డి, శాసమోల బాలప్ప, తంగు విశ్వనాథ్ రెడ్డి, ప్రభువు మిస్కిన్, పగిడి వారి జయంత్ రెడ్డి, మన్నె నాగరాజు తదితర భారతీయ కిసాన్ సంఘం కమిటీ సభ్యులు ప్రభుత్వ నిరక్ష్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే కందుల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పిఆర్సీని తక్షణమే అమలు చేయాలి

### పెండింగు బిల్లుల మంజూరీ లో జాప్యం సరికాదు




యుటిఎఫ్ డైరీ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**బిజినేపల్లి, జనవరి 6 ప్రభాతవార్త:** దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయులకు అందవలసిన, బకాయిలు పడ్డ అన్ని ఆర్థిక పరమైన బిల్లులు మంజూరులో జాప్యం లేకుండా తక్షణమే నిధులు విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. యం శ్రీధర్ శర్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బిజినపల్లి మండల కేంద్రంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు వి.రాములు అధ్యక్షతన నిర్వహించిన టిఎస్ యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నికల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా.యం.శ్రీధర్ శర్మ పాల్గొన్నారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీ హామీలు నెరవేర్చలేదని విడతల వారీగా బడ్జెట్ కేటాయింపులు చేస్తున్నప్పటికీ ఇంకా అనేక మంది ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్ మెంట్ క్లెయిమ్స్ జిపిఎఫ్ పార్ట్ ఫైనల్స్ సరెండర్ బిల్లులు మొదలైనవి ఏడాది కాలంగా ఇంకా అందలేదని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బకాయి పడిన 5 డిఏలు మంజూరు చేసి 2023 జూలై 1 నుండి అమలు పరచాల్సిన పిఆర్సీని వెంటనే అమలు చేయాలని కోరారు.మండల ప్రధాన కార్యదర్శి డి.ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సిపిఎస్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు ప్రభుత్వం పాత పెన్షన్ లో అందే విధంగానే అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తమిళనాడు అష్యూర్డ్ పెన్షన్ విధానాన్ని ప్రకటించిందని అయినా ఇది కూడా చందాతో కూడిన పథకమని వివరించారు. విద్యారంగాన్ని ప్రైవేటు కార్పోరేట్ పరం చేసేలా ఉన్న నూతన జాతీయ విద్యావిధానం 2020" ఎన్ఇపి2020 ని రద్దు చేసి శాస్త్రీయ అవగాహన తో కూడిన ఆధునిక సాంకేతిక మార్పులను అందిపుచ్చుకునేలా ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని తీసుకురావాలి డిమాండ్ చేశారు. సమావేశంలో టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు గా వి.రాములు, ప్రధాన కార్యదర్శి డి.ప్రభాకర్, ఉపాధ్యక్షురాలు పి.నజీమా పర్వీన్ ,కోశాధికారి కె.శ్రీనివాస్ కన్వీనర్ యాకూబ్ అలీ ,మండల కార్యదర్శులు లక్ష్మణ్ మనోజ్‌కుమార్, చంద్రశేఖర్ శేఖర్, రాధ, అలేఖ్య, లావణ్య తదితరులు ఎన్నికైనారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి పి. రఘునందన్ శర్మ చేతులమీదుగా 2026 యుటిఎఫ్ డైరీ క్యాలెండర్ ఆవిష్కరించారు.

# మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్



లీక్ అయిన మిషన్ భగీరథ పైప్‌లైన్

**అలంపూర్ జనవరి 6, ప్రభాతవార్త:** అయిజ మండలం వెంకటాపూర్ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ కావడం తో తాగునీరు వృథా అవుతోంది. స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్‌ను మరమ్మతు చేయాలని కోరుతున్నారు. నీరు వృథా కావడంతో కొన్ని గ్రామాల ప్రజలు నీటి కొరకు ఇబ్బంది పడ్డారు.

## భూత్పూర్ మున్సిపాలిటీని
## తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్



భూత్పూర్ మున్సిపాలిటీని సందర్శించిన
జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

**భూత్పూర్,జనవరి 6,ప్రభాతవార్త :** జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మంగళవారం భూత్పూర్ మున్సిపాలిటీని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఓటర్ల చేర్పులలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ మున్సి పాలిటీని సందర్శించి ఓటర్ల ముసాయిదా జాబితాను పరిశీలించారు.భూత్పూర్ మున్సిపాలిటీలోని కొన్ని వార్డుల ఓటరు జాబితాలో కలెక్టర్ తనిఖీ చేశారు.వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిశీలిస్తున్నామని కమిషనర్ నూరుల్ నజీబ్ కలెక్టర్‌కు వివరించారు.దరఖాస్తుల పరిశీలన,స్వీకరణ ఈ నెల 9వరకు ఉందని,అన్ని దరఖాస్తుల్ని క్షుణ్ణంగా పరిశీలించిన మీదట తుది జాబితాను విడుదల చేస్తామని కమిషనర్ వివరించారు.


## ఉచిత వైద్య శిబిరమును
## సద్వినియోగం చేసుకోండి : సర్పంచ్

**శ్రీరంగాపూర్, జనవరి 6 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో 11.01.2026 ఆదివారం రోజు పెబ్బేరు నందుగల జనని హాస్పిటల్ వారు శ్రీరంగాపూర్ సర్పంచ్ మద్దిలేటి ఆధ్వర్యంలో శ్రీరంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ శిబిరంలో చిన్న పిల్లలకు, స్త్రీలకు,గర్భిణీ స్త్రీలకు, ఉచితంగా వైద్య పరీక్ష లు నిర్వహించి మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చి చూయించుకునేవారు తమ ఆధార్ కార్డును తప్పనిసరిగా తీసుకొని వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరడం జరిగింది.

## పిఆర్‌టియు టిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ఉప్పునుంతల,జనవరి 6 ప్రభాతవార్త :** పిఆర్టియు టిఎస్ క్యా లెండర్‌ను మండల కేంద్రమైన ఉప్పునుంతల ఎమ్మార్సీ కార్యాల యం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. మండల విద్యాధికారి చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షులు మేడిపూర్ మల్లి కార్జున్,రాష్ట్రకార్యదర్శి అజ్మతుల్లా, బిచ్చ నాయక్, శ్రీనివాసులు, గోపి,ఉప్పునుంతల మండల అధ్యక్షులు అమీర్ పాషా, ప్రధాన కార్యదర్శి రాజ వర్ధన్ రెడ్డి, మండల బాధ్యులు రామచంద్ర రెడ్డి, సీనియర్ సభ్యులు రాములు, శ్రీనివాసులు, శ్రీధర్, బాలకృష్ణ, శ్యామల గౌరీ, చంద్రశేఖర్ తదితరు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై
## విద్యార్థులకు అవగాహన



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాన్స్‌పోర్టు అధికారులు

**వనపర్తి, జనవరి 6 ప్రభాతవార్త :** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు 2026 సందర్భంగా వనపర్తి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సైదులు ఇడిఎఆర్ డిస్టిక్ మేనేజర్ మురళీ కృష్ణ పాల్గొని విద్యార్థులకు ,ఉపాధ్యాయు లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించి,వారిచే రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఉపాధ్యాయులు అధికారులను సన్మానించారు.

